
● కథానిక

● మగవాడి ఇష్టాల మధ్య ఆడవారి జీవితం నలిగిపోతోందా?

పి.వి
రమణారావు





అమెరికా వెళ్ళే ప్రయత్నంలో సఫలమై హైదరాబాద్‌లో పనిచేసే ఓ ఇంజనీరు కుర్రాడు సుందరం, పెళ్ళి చూపుల కోసమని మంగళగిరి వెళ్ళాడు తల్లిదండ్రులతో సహా. అదే ఊళ్ళో వుంటున్న వాళ్ళ పిన్నిగారింట్లో దిగి, మంచి సమయం చూసుకొని పిల్ల యింటికి వెళ్ళారు. శ్యామ్రాలావు దంపతులు వారికతిథి మర్యాదలు చేసి, కూతురు స్రవంతి ఎమ్.ఏ.ని తీసుకువచ్చి, హాల్లో సుందరానికి ఎదురుగా కుర్చీలో కూర్చోబెట్టారు.

సుందరం తల్లిదండ్రులకి స్రవంతి వెంటనే నచ్చేసింది. సుందరం చూపు స్రవంతి వెనుకగా లోపలి గుమ్మం దగ్గర నిలుచున్న ఓ చామనఛాయ రంగుకల అమ్మాయి మీద పడింది. లేతనీలిరంగు సాదానూలు చీరకట్టుకొని, ముఖాన పావలా కాసంత ఎర్రటిబొట్టు పెట్టుకొన్న ఆమె చాలా ఆకర్షణీయంగా కనబడింది. తల్లి స్రవంతిని ఏవో ప్రశ్నలడుగుతున్న సమయంలో, సుందరం మార్చి మార్చి ఇద్దర్నీ గుంభనగా చూశాడు. ఆ తర్వాత సుందరం కూడా ఏదో మాటవరసకి నాల్గైదు ప్రశ్నలడిగి, పెళ్ళిచూపులయ్యాయనిపించాడు.

సుందరం తల్లిదండ్రులకప్పటి కప్పుడే స్రవంతి నచ్చేసిందని చెప్పాలనిపించింది. ఒక కారణమేమంటే, లక్షవరకూ కట్నం యిస్తామని ముందుగానే కబురంపడం. ఇక రెండవది స్రవంతి నాజూగ్గా, తెల్లగా, అందంగా వుంది. తల్లిదండ్రుల ఉబలాటం చూసి సుందరం వారిని కనుసన్నలతో వారించాడు. వాళ్ళు కూడా కొడుకు అభిమతం కూడా తెలిసికొని, అంగీకారం తర్వాత తెలియజేస్తే హుందాగా, సభ్యతగా వుంటుందని గ్రహించి, వెళ్ళగానే కబురంపుతామని చెప్పి బయటపడ్డారు.

పిన్నిగారింటికి వెళ్ళిన తర్వాత సుందరం స్రవంతి వెనుకనిల్చున్న అమ్మాయిని గురించి, పన్నెండో క్లాసు చదువుతున్న పిన్నికొడుకు రంగనాథం దగ్గర వివరాలు సేకరించాడు. ఆ అమ్మాయి శ్యామ్రాలావు పక్కింట్లో వుంటున్న అరుణాచలం మేస్టారి కూతురు సూర్యకాంతం. స్రవంతి క్లాసు మేటు, ఆర్థిక స్తోమత లేకపోవడం మూలాన, బి.ఏ. మొదటి సంవత్సరంలో చదువు ఆవుచేసింది. మంగళగిరి మున్సిపల్ లైబ్రరీలో తాత్కాలిక టైపిస్టుగా చేస్తోంది. అరుణాచలం మేస్టారు పెళ్ళి ప్రయత్నాలు కొన్నిచేసి, అతి సామాన్యమైన కుర్రాళ్ళు కూడా అందనంత ఎత్తులో వుండడం మూలాన నిరాశ చెంది, దిగులుపడ్డ జీవితాన్ని గడుపుతున్నాడు.

ఆ రోజురాత్రి భోజనాల సమయంలో పిన్ని మహాలక్ష్మి అడిగింది. "ఏయ్ సుందరం మీ అమ్మానాన్నలకి స్రవంతి నచ్చింది. స్రవంతి అంగీకారం తెలిపిందని శ్యామ్రాలావు కబురంపారు. నీ అంగీకారం కూడా తెలిపితే, వాళ్ళు రేపే తాంబూలాలిచ్చుకోవడం కోసం సిద్ధంగా వున్నారు. ఏమంటావ్?"

సుందరం అందర్నీ చూస్తూ అన్నాడు. "నే చెప్పే మాటలు మీకు విచిత్రంగా వినిపించవచ్చు. స్రవంతి వెనుకగా నిల్చున్న అరుణాచలం మేస్టారి కూతురు సూర్యకాంతం నాకు నచ్చింది. బాబాయ్ మీరువెళ్ళి ఆయనతో మాట్లాడండి. వాళ్ళు కనక ఒప్పుకొంటే, వెంటనే ముహూర్తం పెట్టించండి. నయాపైసా కూడా కట్నంగా వద్దని చెప్పండి. ఈ పెళ్ళి కనక జరిపిస్తే, మీ కందరికీ ఆ జన్మాంతం ఋణపడి వుంటాను!"

"అక్కని చూసుకోవడానికి వెళ్ళి చెల్లెలు నచ్చిందన్న ఉదంతాలు చాలా విన్నానుకాని, పెళ్ళి చూపులకని ఓ యింటికి వెళ్ళి, పక్కింటి పిల్ల నచ్చిందని వినడం నాకిదే మొదటిసారి! అక్కా, నీ కొడుకు సుందరం మనసు తెలిసింది కదా! వాడిష్ట ప్రకారమే చేయడం బావుంటుంది మరి!" అంది సుందరం పిన్ని. సుందరం తల్లిదండ్రులు వివేకవంతులు. చేజారిన కట్నం విషయమై మనసు కొంచెం నసిగినా, "నీకు పెళ్ళి కావడం మాకు ముఖ్యం. అంతా నీ యిష్టం!" అన్నారు.

సుందరం బాబయ్య భోజనాలయిన తర్వాత, కండువా భుజంమీద వేసుకొని అరుణాచలం మేస్టారింటికి వెళ్ళి, రాత్రి పదింటికి యింటికి తిరిగి వచ్చాడు. "మనహృదయ వైశాల్యానికి ఆయన కృతజ్ఞతలు తెలువుకొని, వరించి వస్తోన్న అదృష్టాన్ని నిరాకరిస్తోన్నందుకు క్షమించమన్నాడు. ఆయనన్న మాటల సారాంశమిది. 'మా యిరువురి కుటుంబాలూ పన్నెండు సంవత్సరాలుగా యిరుగుపొరుగులుగా వుంటూ వచ్చాయి. ఈ రోజున ఈ సంబంధాన్ని ఒప్పకొని శ్యామ్రాలావుగారి దృష్టిలో దిగజారడం నాకిష్టం లేదు!"

మర్నాడుదయం అందరూ గుడికి వెళితే, సుందరం మట్టుకు చల్లగా జారుకొని శ్యామ్రాలావు గారింటికివెళ్ళి జరిగిందంతా నిజం దాచకుండా ఆయనకీ, స్రవంతికీ చెప్పాడు. తండ్రీ కూతుళ్ళిద్దరూ ఒక్క క్షణం ఒకరి మొహాల్లోకి మరొకరు చూసుకొన్నారు. స్రవంతి చిరునవ్వు చూసి, శ్యామ్రాలావు సుందరాన్ని చెయ్యి పట్టుకొని, అరుణాచలం మేస్టారింటికి తీసుకువెళ్ళాడు. వెనుకగా స్రవంతి కూడా వెళ్ళింది.

అరుణాచలం మాస్టారి రెండు చేతులూ పట్టుకొని శ్యామ్రాలావు, "మేస్టారూ, ఇతనే సుందరం. ఉన్నతమైన ఆలోచనలతో మీరితని బాబయ్య గారితో అన్నమాటలన్నీ చెప్పాడు. నాపట్ల చూపించిన గౌరవానికి జోహార్లర్పిస్తున్నాను. సూర్యకాంతాన్ని కోరి చేసుకొంటాననంటున్నాడు. కాదనకండీ!" అన్నాడు. మాస్టారి కళ్ళ నుంచి జారిన కన్నీటి చుక్కలు కృతజ్ఞతలు తెలిపాయి.

ఆ పెళ్ళి జరిగిందని వేరే చెప్పక్కర్లేదు. ఒక్కోసారి ఎన్ని ప్రయత్నాలు చేసినా జరగని పనులు వాటంతటవే జరిగిపోతాయి. 'ఘటన' అంటే ఇదేకాబోలు.

"మానవ సంబంధాన్ని, విలువల్ని ఎత్తిచూపుతూ కథని క్లుప్తంగా వ్రాశావు. కొస్త శృంగారం కూడా ఉంటే బావుండేది!" అన్నాడు రాజు.

మొదటిరాత్రి సూర్యకాంతం సుందరం ఒడిలో తలపెట్టుకొని పడుకొని "స్రవంతి తెల్లగా, నాజూగ్గా, అందంగా వుంటుంది. విద్యాధికురాలు, ఐశ్వర్యవంతుల ఇంట్లో పుట్టిపెరిగింది. అయినా కాదని నన్ను చేసుకున్నారు. నాలో ఏంచూసి చేసుకొన్నారు?!" అని అడిగింది గోముగా.

"అందానికీ, ఆకర్షణకీ భాష్యం చెప్పలేను. అయినా అడిగావు కాబట్టి చెప్తున్నాను. కౌగలింతలో నా ఛాతీని ప్రతిఘటించాయే..." అంటూ పమిట వైపు చూశాడు. సూర్యకాంతం సిగ్గులో ముఖాన్ని చేతుల్లో దాచుకొంది.

'పుర్రెకోబుద్ధి, జిహ్వకోరుచి' అంటే ఇదే కాబోలు!

"అసలు దీన్ని మొదట్నుంచి హాస్యధోరణితో వ్రాస్తే చాలా బావుండేది!"అన్నాడు కోటి.

తిరిగి వ్రాయడానికి ఓపిక లేదు! హాస్యాంతం మట్టుకు చెయ్యగలను.

ఓ నాలుగు నెలల తర్వాత, ఓ ప్రముఖ వారపత్రికలో సలహాల శీర్షికలో రెండు ప్రశ్నల్ని, వాటికి సమాధానాల్ని లక్షలాది పాఠకులు చదివారు. ఆ రెండు ప్రశ్నలూ ఏమిటంటే,

1. అరుంధతి–కొమరగిరి.

నేను తెల్లగా, అందంగా వుంటాను. అయినా వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి వెళ్తున్నాయి. వక్షోజాలు పెద్దవిగా అయ్యేమార్గం చెప్పండి.

2. లక్ష్మీకాంతం–వేమగిరి

మా వారు నా అవయవ సంపదని చూసి ముచ్చటపడి నన్ను వివాహం చేసుకొన్నారు. వయసుతో బాటు బిగిసడలితే, మావారు నన్ను సరిగ్గా చూసుకొంటారో లేదో అన్న భయం ఇప్పట్నుంచీ పీడిస్తోంది. అంగసౌష్ఠవం కాపాడుకొనే మార్గాలు చెప్పగలరు.

ఎవరిగోల వారిది. పీతకష్టాలు పీతవి. ●



# సారీ మిస్టర్



**కె. ఎస్. దేవి**

బస్ కోసం వెయిట్ చేస్తూ నిలబడ్డాను. అరగంట అయినా రాలేదు నేను ఎక్కవలసిన బస్సు. ఛీ! ఈ వెధవ బస్సులు ఎప్పుడూ ఇంతే. టైముకిరావు మనసులోనే విసుక్కున్నాను. దరిదాపుల్లో ఆటో కూడాలేదు. నాకు చాలా టెన్షన్‌గా వుంది. అందుకు కారణం నేను ఈరోజే బ్యాంక్‌లో చేరాల్సినరోజు. ఇంతలో నా బస్ వచ్చి ఆగింది. 'మిస్' అన్న పిలుపుతో వెనక్కి తిరిగి చూశాను. స్టూడెంట్‌లా ఉన్నాడు. పైగా చేతిలో ఏదో కాగితం కూడా వుంది. ఏముంది. 'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు లేకుండా నేను బ్రతకలేను' అని డైలాగులు చెప్తాడు కాబోలు. చెప్పలేక ప్రేమలేఖ రాసుకొచ్చాడు కాబోలు. ఛీ! ఈ మగవాళ్ళంతా ఇంతే. ప్రేమ తప్ప వేరే పనేమీలేదు అని ముఖం తిప్పకున్నాను.

ఆశ్చర్యం! నా బస్‌లో కూడా అతనే. నన్ను ఫాలో అవుతున్నాడన్నమాట. దిగవలసిన స్టేజి వచ్చేసింది. 'మిస్' అంటూ నా వెనకపడుతున్నాడు. ఇంక లాభం లేదన్నట్లు ఏమిటన్నట్లు చిరాగ్గా చూశాను. అతను నిదానంగా చెప్పకుపోతున్నాడు. మేడమ్! బ్యాగ్‌లో నుండి ఈ కాగితం పడిపోయింది. మీరు పలకకుండా వెళ్ళిపోయారు. మీరు నన్ను ఏవేవో ఊహించుకుంటున్నట్టున్నారు. అంతే! నా మైండ్ పనిచేయడం మానివేసింది ఒక క్షణం. కారణం అది నా 'అపాయింట్‌మెంట్ ఆర్డర్'. సారీ! మిస్టర్! ఐ యాం ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ అని మనస్ఫూర్తిగా అన్నాను. కాని అతను ఆ సమయానికే వెళ్ళిపోయాడు. మైగాడ్! ఎంత మిస్టేక్ జరిగింది. అందుకే ఎవర్ని తప్పుగా అంచనా వేయకూడదంటారు ఇందుకే కాబోలు. అవును మరి ఇది స్వానుభవం.

